సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION

# సూర్య

నేటి దినపత్రిక
www.suryaa.com

4PM
www.suryaa.com
ఆదివారం
27-07-2025
పేజీలు: 0






## తిరుమల శ్రీవారి సేవలో విజయ్, భాగ్యశ్రీ బోర్సే

రౌడీ భాయ్ విజయ్ దేవరకొండ, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే కాంబినేషన్ లో తెరకెక్కిన సినిమా కింగ్డమ్. ఈ నెల 31న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ క్రమంలో శనివారం తిరుపతి లో ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత నాగ వంశీ, విజయ్, భాగ్యశ్రీ బోర్సేలు ఆదివారం తెల్లవారుజామున వీఐపీ దర్శన సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన వీరికి టీటీడీ అధికారులు సాదర స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వీరికి వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. కాగా, ఈ మూవీ ట్రైలర్ బాగా ఆకట్టుకుంటోంది. దీంతో నెట్టింట ట్రెండింగ్ లో కొనసాగుతోంది. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.




# కొత్తగా రేషన్ కార్డు వచ్చిన వారికి గుడ్‌న్యూస్

తెలంగాణలో కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాలకు త్వరలో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయంపై వైద్య, ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు రేషన్ కార్డుల్లో నమోదైన కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందుతున్న సంగతి తెలిసిందే. అయితే 2025 జనవరి 1 నాటికి రాష్ట్రంలో ఉన్న మొత్తం 89.95 లక్షల రేషన్ కార్డులకు అనుబంధంగా 2.81 కోట్ల మంది పేర్లు ఆరోగ్యశ్రీ పోర్టల్‌లో నిక్షిప్తమయ్యాయి. వీరికి నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా నిబంధనల మేరకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి.

**కొత్తగా 6 లక్షల కార్డులు — 30 లక్షల మందికి అవకాశం**


ఈ ఏడాది జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు సుమారు 6 లక్షల కొత్త కార్డులు జారీ కాగా, వాటితో కలిసి మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 95.56 లక్షలకు చేరుకుంది. ఇందులో కొత్తగా చేరిన లబ్ధిదారుల సంఖ్య 30 లక్షలు. వీరి వివరాలు త్వరలో ఆరోగ్యశ్రీ పోర్టల్‌లోకి ఎక్కించనున్నట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను తగిన ఆదేశాలు జారీ చేశారు. డిసెంబరు 2023లో ప్రభుత్వం మారిన తర్వాత ఆరోగ్యశ్రీ సేవల వినియోగం మరింత పెరిగింది. మంత్రి దామోదర వెల్లడించిన వివరాల ప్రకారం, కొత్త ప్రభుత్వ పాలనలో ఇప్పటివరకు 10.72 లక్షల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు లభించాయి. ఈ సేవల కోసం ప్రభుత్వం ఆసుపత్రులకు మొత్తం రూ.1,590 కోట్లకు పైగా బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. ప్రతి నెలా సగటున రూ.100 కోట్ల వరకు ప్రభుత్వం బిల్లుల చెల్లింపులు చేయడంతో ప్రైవేట్ ఆసుపత్రులు కూడా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం 461 ప్రైవేట్ మరియు కార్పొరేట్ ఆసుపత్రులు ఈ సేవలు అందిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన అన్ని ఔషధాలు కూడా ఉచితంగా అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

## మెగా ప్రాజెక్ట్‌ను పట్టేసిన శ్రీలీల

యంగ్ బ్యూటీ శ్రీలీల ప్రస్తుతం వరుస సినిమాలో టాలీవుడ్‌లో ఫుల్ బిజీగా మారింది. హిట్, ఫ్లాపుతో సంబంధం లేకుండా.. పెద్ద-చిన్న హీరోతో సంబంధం లేకుండా ఈ బ్యూటీ వరుసబెట్టి సినిమాలు చేస్తూ దూసుకుపోతుంది. ఇక ఈ బ్యూటీ బాలీవుడ్‌లోనూ సాలిడ్ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటికే యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్ నటిస్తున్న సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది ఈ చిన్నది. అయితే, ఈ సినిమా ఇంకా రిలజ్ కాకముందే, ఇప్పుడు బాలీవుడ్‌లో ఓ సాలిడ్ ప్రాజెక్ట్ పట్టేసిందట. స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించబోయే ఓ క్రేజీ ప్రాజెక్టులో హీరోయిన్‌గా శ్రీలీల నటించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో మరో నటుడు బాబీ డియోల్ కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడట. ఈ సినిమాతో బాలీవుడ్‌లోనూ క్రేజీ హీరోయిన్‌గా మారేందుకు శ్రీలీల గట్టి ప్లాన్ చేస్తున్నట్లు బి-టౌన్ వర్గాలు చెబుతున్నాయి.

## కింగ్డమ్ ట్రైలర్ విడుదల

రౌడీ హీరో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'కింగ్‌డమ్'. ఈ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రం జూలై 31న ప్రపంచవ్యాప్తంగా తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా వరుసగా ప్రమోషన్స్ నిర్వహిస్తుంది చిత్రయూనిట్. ఇప్పటికే కింగ్‌డమ్ బాయ్స్ అంటూ దర్శకుడు గౌతమ్ తిన్ననూరితో పాటు విజయ్ దేవరకొండ, సందీప్ రెడ్డి వంగా కలిసి ఒక పాడ్ కాస్ట్‌ని విడుదల చేయగా ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఇదిలావుంటే తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.







## రాహుల్‌ను అంబేద్కర్ తో పోల్చిన కాంగ్రెస్ ఓబీసీ నేత ఉదిత్ రాజ్

రాహుల్ గాంధీని 'రెండో అంబేద్కర్' అని అభివర్ణించిన కాంగ్రెస్ ఓబీసీ నేత ఉదిత్ రాజ్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఈ వ్యాఖ్యలు రాహుల్ గాంధీ ప్రతిష్ఠను పెంచడానికి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నాలని విమర్శించింది. ఉదిత్ రాజ్, ఒక ప్రముఖ దళిత నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి, రాహుల్ గాంధీ దేశంలో సామాజిక న్యాయం కోసం చేస్తున్న పోరాటాన్ని నాటి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రస్థానంతో పోల్చారు. "రాహుల్ గాంధీ అంబేద్కర్ వారసత్వాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. పేదల, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. ఆయన రెండో అంబేద్కర్ అవుతారు" అని రాజ్ వ్యాఖ్యానించారు.

## ఇజ్రాయెల్ దాడిలో 25 మంది పాలస్తీనియన్లు మృతి


ఇజ్రాయెల్-గాజా వివాదం మొదలై దాదాపు రెండు సంవత్సరాలు అవుతోంది. ఇరు వర్గాల దాడుల్లో వందల సంఖ్యలో పౌరులు మరణించారు. తాజాగా ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 25 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. భీకర పోరు వల్ల గాజాలో కరువు తాండవిస్తోందన్నారు. సహాయక కేంద్రాల వద్ద నిరాయుధ పౌరులపై విచక్షణారహితంగా ఇజ్రాయెల్ సైనికులు కాల్పులు జరిపినట్లు పేర్కొన్నారు. దాడుల కారణంగా పలు ఆస్పత్రి భవనాలు పూర్తిగా ధ్వంసమైనట్లు తెలిపారు.

## టీచర్ల పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్

రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపిం ది. ఉపాధ్యాయులకు సంబంధించిన పదోన్నతుల ద స్త్రంపై శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతకం చేసినట్లు సమాచారం. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయు లు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వివి ధ సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్ ఖాళీల్లో ప్రమోషన్లు ఉ పాధ్యాయులకు పదోన్నతులు లభించనున్నాయి. రెం డు మూడు రోజుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన షెడ్యూలు విడుదలయ్యే అవకాశం ఉంది.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశం ఉంది. స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి రావాల్సి ఉంది. గతేడాది సుమారు 1500 మంది స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించగా, వివిధ కారణాల వల్ల మల్టీజోన్-2లో పోస్టులు మిగిలిపోయాయి. అలాగే పదవీ విరమణ వల్ల సుమారు 750 గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి ఇచ్చి ఈ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంటుంది. కొంతకాలంగా ఉపాధ్యాయులు దీనికోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనికి సంబంధించిన ఫైల్ క్లియర్ అయ్యింది. అదేవిధంగా




గెజిటెడ్ హెచ్‌ఎం పదోన్నతులతో ఖాళీ అయ్యే స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్‌జీటిలతో భర్తీ చేయనున్నారు. డిఎస్సి -2012 తర్వాత పీఈటీ, భాష పండితులకు కూడా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. వీరు దాదాపు 800 మంది ఉన్నారు. వారి పదోన్నతికి కూడా ప్రభుత్వం అనుమతించినట్లు సమాచారం. జూన్ 30 వరకు ఉన్న ఖాళీలను పరిగణలోకి తీసుకుని పదోన్నతుల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిసింది. ఇప్పటికే చాలా పాఠశాలల్లో రెగ్యులర్ హెచ్‌ఎంలు లేకపోవడం వల్ల.. ఈ కొరత తీర్చేందుకు ప్రభుత్వం వేగంగా టీచర్లు పదోన్నతుల ప్రక్రియను పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.



## జలపాతంలా... చీలం జానకీబాయి చెరువు అలుగు

ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గ్రామంలోని అటవీ ప్రాంతంలో ఉన్న జానకీబాయి చెరువు పూర్తి స్థాయిలో నిండి శనివారం మధ్యా హ్నాం నుంచి అలుగు పొంగి పొర్లుతోంది. జలపాతాన్ని తలపించేలా ఎత్తు నుంచి నీరు పడుతుండటంతో ఈ అలుగును చూసేందుకు సందర్శకుల తాకిడి పెరిగింది. ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తోంది. వర్షాలు పడుతుండటం చెరువుకి చేరుకోవడానికి ఉన్న దారి కూడా బురదగా మారడం, అక్కడకి వెళ్లే సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM





# రేవంత్ రెడ్డిపై జగదీశ్ రెడ్డి ఫైర్

రాజకీయాల్లో నటించడం, డైలాగులు చెప్పడంలో రావు గోపాలరావు, కోటా శ్రీనివాసరావును రేవంత్ రెడ్డి మించిపోయారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఎద్దేవాచేశారు. సోనియాగాంధీ అవార్డు గ్రహీత అయిన రేవంత్ మానసిక స్థితిపై ప్రజల్లో అనుమానం ఉందన్నారు. రేవంత్ రెడ్డి నటనా కౌశల్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఆయన మాటలు వింటే గోబెల్స్ ఆత్మహత్య చేసుకుంటారని చెప్పారు. అబద్దాలు చెప్పడంలో రేవంత్ రెడ్డి గోబెల్స్‌ను మించిపోయారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, బూడిద భిక్షమయ్య గౌడ్, బీ ఆర్ ఎస్ నేత చింతల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి మాటలు వింటే జైపాల్ రెడ్డి ఆత్మ ఆత్మహత్య చేసుకుంటుందన్నారు. జైపాల్ రెడ్డి ఎన్నడూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని, తెలంగాణ గురించి మాట్లాడలేదని రేవంత్ రెడ్డి గతంలో అన్నారని చెప్పారు. అసలు రేవంత్‌ని మనిషిలాగా చూడటానికి కూడా జైపాల్ రెడ్డి ఇష్టపడలేదని, గొంగళి పురుగు కంటే హీనంగా చూశారని విమర్శించారు. రేవంత్ రెడ్డిని జైపాల్ రెడ్డి ముందే కరెక్ట్‌గా అంచనా వేశారని మండిపడ్డారు.




# సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్

క్రికెట్ అభిమానులు అత్యంత ఆసక్తిగా వేచిచూస్తున్న ఆసియా కప్ — 2025 షెడ్యూల్ వచ్చేసింది. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు ఈ టోర్నీని యూఏఈలో నిర్వహించనున్నట్టు ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు మోహ్సిన్ నఖ్వీ తన సోషల్ మీడియా పోస్ట్‌లో అధికారికంగా వెల్లడించారు. పూర్తి షెడ్యూల్‌ను ఏసీసీ 'ఎక్స్' ఖాతాలో ప్రకిటించారు. 17 వ ఎడిషన్‌గా జరుగబోయే ఈ టోర్నీలో భారత్ తమ తొలి పోరును సెప్టెంబర్ 10న యూఏఈతో జరిగే మ్యాచ్‌తో టైటిల్ వేటను ఆరంభించనుంది. 14న భారత్, పాక్ తలపడనున్నాయి. 8 దేశాలు పాల్గొనబో యే ఈ టోర్నీని టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించగా గ్రూప్-ఏలో భారత్, పాకిస్థాన్, యూఏఈ, ఓమన్ ఉన్నాయి. గ్రూప్-బీలో బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గానిస్థాన్, హాంకాంగ్ ఉన్నాయి. సెప్టెంబర్ 9 నుంచి 19 దాకా గ్రూప్ దశ మ్యాచ్‌లను నిర్వహించనుండగా 20 నుంచి సూప ర్ -4 స్టేజ్ మొదలవుతుం ది. 28వ తారీఖున ఫైనల్ జరుగుతుంది. భారత్, పాకిస్థాన్ ఒకే గ్రూప్‌లో ఉం డటంతో ఈ టోర్నీలో దాయాదులు మూడుసార్లు (ఇరుజట్లు ఫైనల్ చేరకుంటే రెండుసార్లు) ఢీకొనే అవకాశముంది.

# కుర్రకారును ఫిదా చేస్తున్న ఆశు రెడ్డి


బిగ్ బాస్‌తో ఎంట్రీ ఇచ్చిన ఆశు రెడ్డి తన గ్లామర్ తో కుర్రకారును ఫిదా చేస్తోంది.తొలుత జూనియర్ సమంతగా పాపులారిటీ సంపాదించుకున్న ఈ బ్యూటీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది.ఛల్ మోహన్ రంగ, ఫోకస్ వంటి సినిమాల్లో నటించి తనకంటూ ప్రత్యేక ఫ్యాన్స్‌ను క్రియేట్ చేసుకుంది.యూట్యూబ్‌లో వచ్చిన డబ్ స్మాష్ వీడియోలతో బాగా పాపులర్ అయిపోయింది.తాజాగా, బ్లాక్ కాంబినేషన్ వన్ పీస్ డ్రెస్‌ల్లోని తన గ్లామర్ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసింది.ఈ ఫొటోల్లో ఆశు రెడ్డి.. హాట్ హాట్‌గా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటో షూట్‌తో మరోసారి సోషల్ మీడియా రచ్చ రచ్చ అవుతోంది.




# హరిద్వార్ మానసా దేవి ఆలయంలో తొక్కిసలాట.. ఆరుగురు మృతి

హరిద్వార్‌లో తొక్కిసలాట జరిగింది. ఆదివారం ఉదయం హరిద్వార్‌లోని మానసా దేవి ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. ఈ క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ విషాద సంఘటనలో ఆరుగురు మరణించగా, 25 మందికి పైగా గాయపడ్డారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని హరిద్వార్ ఎస్ఎస్‌పి తెలిపారు. అధికారుల వివరాల ప్రకారం.. మానసా దేవి ఆలయానికి వెళ్లే 2 కి.మీ. నడక మార్గంలో ఈ ఉదయం తొక్కిసలాట జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఓ ప్రదేశంలో ఆగిపోవడంతో రద్దీ ఏర్పడింది. దీంతో కొంతమంది వెనక్కి వెళ్లేందుకు ప్రయత్నించగా.. ఇది భయాందోళనలకు దారితీసింది. జనం పరుగులు పెట్టడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఊపిరాడక అనేక మంది స్పృహతప్పి పడిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం అంబులెన్స్‌ల ద్వారా సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. మానసా దేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాట సంఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి విచారం వ్యక్తం చేశారు. SDRF ఉత్తరాఖండ్ పోలీసులు, స్థానిక పోలీసులు, ఇతర రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలలో నిమగ్నమై ఉన్నాయని ఆయన తెలిపారు. అధికారులను నిరంతరం సంప్రదిస్తూ.. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాని చెప్పారు. భక్తులందరి భద్రత, శ్రేయస్సు కోసం మాతృదేవతను ప్రార్థిస్తున్నాని ఆయన పేర్కొన్నారు.

# రాబోయే టెస్టు సిరీస్ ల్లో బుమ్రా కనిపించకపోవచ్చని వెల్లడి



భారత క్రికెట్ జట్టు స్టార్ పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తన టెస్ట్ కెరీర్‌కు ముగింపు పలికే అవకాశం ఉందని భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. బుమ్రాకు శరీరం సహకరిస్తున్నట్టుగా లేదని, దాంతో అతడు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడని అన్నాడు.,ఇది అతని టెస్ట్ క్రికెట్ భవిష్యత్తును ప్రభావితం చేయవచ్చని కైఫ్ పేర్కొన్నాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు, భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, బుమ్రా ఐదు టెస్టుల్లో కేవలం మూడింటిలో మాత్రమే ఆడతాడని చెప్పడం తెలిసిందే. బుమ్రాపై పనిభారం పడకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, మాజీ క్రికెటర్ల అభిప్రాయం ప్రకారం, బుమ్రా బౌలింగ్ వేగంలో తగ్గుదల, అతను ఎదుర్కొంటున్న శారీరక ఇబ్బందులు ఆందోళన కలిగిస్తున్నాయి.మహ్మద్ కైఫ్ మాట్లాడుతూ, "బుమ్రా తన శరీరంతో తీవ్రంగా పోరాడుతున్నాడు. అతని శరీరం పూర్తిగా సహకరించడం లేదు. అతను 100 శాతం ఇవ్వలేకపోతే, స్వచ్ఛందంగా టెస్ట్ క్రికెట్ నుండి తప్పుకునే అవకాశం ఉంది. అదే జరిగితే రాబోయే టెస్టు సిరీస్ ల్లో టీమిండియాలో బుమ్రా కనిపించకపోవచ్చు" అని వ్యాఖ్యానించాడు.బుమ్రా గత కొంతకాలంగా గాయాలతో బాధపడుతున్నాడు. అద్భుతమైన ప్రదర్శనలతో భారత జట్టుకు కీలక బౌలర్‌గా నిలిచినప్పటికీ, గాయాలు వేధిస్తున్నాయి. ఇంగ్లండ్‌తో జరిగిన ప్రస్తుత సిరీస్‌లో బుమ్రా రెండుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శన కనబర్చినప్పటికీ, ఓవరాల్ గా అతడి ప్రదర్శనపై కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బుమ్రా ఈ శారీరక సవాళ్లను ఎలా అధిగమిస్తాడు అతని టెస్ట్ కెరీర్ భవిష్యత్తు ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



# ఆగష్టు 1 నుంచి ఓటిటిలోకి తమ్ముడు

టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రం "తమ్ముడు" కోసం అందరికీ తెలిసిందే. ఈ చిత్రంతో అయినా నితిన్ మంచి కంబ్యాక్ ఇస్తాడు అనుకుంటే అది ఈసారి కూడా జరగలేదు. ఇక ఈ చిత్రానికి వేణు శ్రీరామ్ దర్శకత్వం వహించగా సీనియర్ నటి లయ ఈ సినిమాతోనే రీఎంట్రీ ఇచ్చారు. అయితే ఈ చిత్రం ఇప్పుడు ఓటిటి డేట్ ని ఫిక్స్ చేసేసుకుంది. ఈ చిత్రం హక్కులు దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అందులో ఈ ఆగష్టు 1 నుంచి సినిమా అందుబాటులో ఉందనున్నట్టుగా అనౌన్స్ చేసేసారు. తెలుగు సహా తమిళ్, ఇంకా కన్నడ, మళయాళ భాషల్లో కూడా ఈ చిత్రం అందుబాటులో ఉండనున్నట్టు తెలిపారు. ఇక ఈ చిత్రానికి ఆజనీష్ లోకనాథ్ సంగీతం అందించగా వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ ఫీమేల్ లీడ్ లో నటించారు.

# స్కూల్ పుస్తకాల్లో పాఠ్యాంశంగా ఆపరేషన్ సింధూర్

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' వివరాలను స్కూల్ పుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చాలని కేంద్రం నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గతంలోనే ప్రకటించారు. తాజాగా ఈ విషయంపై 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్' స్పందించింది. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే ఉద్దేశంతో ఆపరేషన్ సిందూర్‌ను సిలబస్‌లో చేర్చుతున్నట్లు ఎన్‌సీఈఆర్టీ తెలిపింది. పిల్లలకు జాతీయ భద్రత, సైనిక వ్యూహం, దౌత్యం ప్రాముఖ్యతను బోధించడమే ఈ నిర్ణయం వెనకున్న లక్ష్యమని తెలిపింది. ఇందుకోసం ఎన్ సీఈఆర్టీ ప్రత్యేక మాడ్యూల్‌ను సిద్ధం చేసింది. ఈ మాడ్యూల్ రెండు భాగాలుగా విభజిస్తారు. ఒకటి 3-8 తరగతుల విద్యార్థుల కోసం, మరొకటి 9 నుంచి 12 తరగతుల విద్యార్థుల కోసం రూపొందిస్తారు. ఆదిత్య ఎల్1 చంద్రయాన్ అంతరిక్ష మిషన్‌లు, ఇటీవల శుభాన్ను శుక్లా 'అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)'కు వెళ్లిన అంశాలను కొత్త సిలబస్‌లో చేర్చనున్నట్లు అధికారులు తెలిపారు.

